
POETRY & ILLUSTRATIONS



# నేనెలావర్ణించను?

Nenela Varninchanu

Shruthi Panga

# NENELA VARNINCHANU

Shruthi Panga
B.A. III Year
TGSWRDC, Nizamabad

SCHOOL OF
EMERGING WRITERS

We sincerely thank

Dr. ALAGU VARSHINI

Secretary, TGSWREIS

Book Title : **Nenela Varninchanu**
Author : Shruthi Panga
Chief Editor : Dr. K. Sandhya Deepthi
ISBN : 9789348512871
First Edition : 2024

Copyright© **Shruthi Panga**
The authors are responsible for the contents of their papers compiled in the publication. The publishers or the printers or the editors are not responsible to any consequences of copyright infringement for the works presented in this volume. In spite of best efforts, there could be some errors in this publication and the reaches are requested to communicate any errors to the editors to avoid any such errors in future.

**Paramount Publishing House**
Plot No. A-531, H.No. 4-32-521, Phase-1, Allwyn Colony, Kukatpally, Hyderbad.
Ph. 7799000082
Sales Offices:
Hyderabad
Plot No. A-531, H.No. 4-32-521, Phase-1, Allwyn Colony, Kukatpally, Hyderbad.
Ph. 7799000082
New Delhi
C/14, SDIDC Work Centre Jhilmil Colony, New Delhi-100095,
paramountpublishers@gmail.com I alluriasr2005@yahoo.com
Published by Krishna Prasad Alluri for Paramount Publishing House and printed by him at Sai Thirumala Printers.

SCHOOL OF
EMERGING WRITERS
TGSWREIS

# ముందుమాట

కవిత్వం అంటే ఏమిటి ? అన్న ప్రశ్న కళానుభవం గురించి చర్చలు జరుగుతున్న కాలం నుంచి కొనసాగుతూ వస్తున్నది. దానికి తమకు తోచిన రీతిలో ఎందరో అలంకార శాస్త్రవేత్తలు నిర్వచనాలను చెప్పే ప్రయత్నం చేశారు. ఇప్పటికీ ఎంతోమంది ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. నిజానికి కవిత్వం రాయడానికి కవిత్వం అంటే ఏమిటో తెలియవల్సిన పనిలేదు. కానీ మనం రాసేది కవిత్వం అవుతుందా అని తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. అది బుడి బుడి అడుగుల కవితా రచన అయినప్పుడు దాని అవసరం ఎక్కువగా ఉంటుంది. అయినా ప్రతిభ కలిగిన కవికి అది అసంకల్పితంగా వస్తుంది. దాని తత్త్వమూ తెలుస్తుంది. ఆ తెలుసుకునే అడుగులో ఈ తొలి ప్రయత్నం విత్తనంగా ఉపయోగపడుతుంది. భావాన్ని తగిన భాషలో పొందుపరచడానికి అనుభవం కావాలి. అది అభ్యాస సాధ్యం. అటువంటి అభ్యాసం విద్యార్థి దశలో ఏర్పడడం సాంఘిక సంక్షేమ కళాశాలల్లో చదువుకునే ఈ పిల్లలు అదృష్టంగా చెప్పాలి. అందుకు తగిన శిక్షణను వారు విద్యార్థి దశలోనే పొందేందుకు కృషి చేస్తున్న ఈ అధ్యాపక బృందాన్ని ముందుగా అభినందిస్తున్నాను.

'నేనెలా వర్ణించను' అంటూ తన కవితా రచనతో మన ముందుకు వస్తున్నది విద్యార్థి కవయిత్రి పి.శృతి. నేనెలా వర్ణించను ఈ 50 కవితలలో ఒక కవితా శీర్షికే అయినా ఇది ఆమె భావుకతను కవిత్వం పట్ల ఆమెకున్న అభిరుచిని తెలియపరుస్తున్నాయి. ఈ కవితా సంపుటిలో 50 కవితలు ఉన్నాయి. అన్నీ విద్యార్థి కవయిత్రి అంతరంగంలో మెదిలిన భావ తరంగాలకు ప్రతినిధులే.

కవితా వస్తువును నిర్ణయించుకోవడంలో, భావాలను విడమరచడంలో తడబాటు లేదు. స్పష్టత ఉంది. దీన్ని వ్యక్తీకరించడానికి తగినంత కృషి అవసరం. దాని పట్ల శ్రద్ధ చూపగలిగితే ఈ విద్యార్థి కవయిత్రి యువ కవయిత్రిగా తెలుగు సాహిత్య క్షేత్రంలో తన ముద్రను నిలుపుకోగలుగుతుంది. ఏం అవుతానో అన్న విషయంలో సందిగ్ధత ఉన్నా తానొక అద్భుతం అవుతానన్న స్పష్టత కవయిత్రిలో ఉంది. ప్రశ్న పరమార్థం వైపు చేరడానికి తొలి నాంది.

తెలంగాణ మట్టివాసన ధిక్కారం ఈ కవయిత్రిలో ఉందని నిరూపించేది

పాత పాట అన్న కవిత. ఈ  ధిక్కార స్వరమే నిజాం దించిన తూట అనకుండా 'నిజంగాడు' అని కవయిత్రితో అనిపించింది. వ్యక్తులు తమను విశ్వైక మానవులుగా అభివ్యక్తీకరించుకుంటారు. జాషువా తనను తాను "విశ్వ నరుడ నేను" అన్నాడు. శృతి తాను విశ్వాన్ని అంటూ విశ్వంలోని సమస్త వస్తువులలోనూ తనను తాను గమనించమని వ్రాసిన కవిత 'యునివర్సల్' 'అంబేద్కర్' కవిత ఆశావాహ దృష్టికి భూమిక. మళ్లీ రావాలని కోరుకోవడం వేరు. ఆ కోరికకు కారణాలు చూపడం వేరు. కారణాలను చూపడం ద్వారా సమకాలీన సమాజాన్ని కళ్ళ ముందు తెచ్చింది ఈ విద్యార్థి కవయిత్రి. 'పొదల గుంపు' కవిత సమాజ ఆకృత్యాలకు సంకేతంగా నిలిచే కవిత. ఈ గుంపులో సమాజం చూడని కోణాలను కవయిత్రి చూపుతుంది. ఈ దుశ్చర్యలు పోవాలంటే ఆయువుల వాయువులను ప్రజలు ఊదాలని ఖడ్గానికి కాదు కలానికి పదును పెట్టాలని కవయిత్రి అనడం సమాజం పట్ల తనకున్న బాధ్యతను చెబుతున్నది. అదే సందర్భంలో సమాజానికి ఉండవలసిన బాధ్యతను విడమరుస్తున్నది. చుట్టరికం ఆర్ద్రత నిండిన మంచి కవిత. దరిద్రుడికి దారిద్రమే చుట్టం, చావే మోక్షం అని తీర్పునిచ్చింది కవయిత్రి. రైతన్న కవిత కర్షకవీరునిగా అతను చేస్తున్న సేవను గుర్తు చేస్తుంది. 'మీరే రావాలి' కవిత వ్యక్తి చైతన్యం కంటే సామూహిక చైతన్యం ప్రధానమైందని చెబుతుంది. నేనేలా వర్ణించను కవిత పోరాటాల బాటలో నడిచిన ఏ వ్యక్తికైనా అన్వయించే కవిత.

సమాజం పట్ల బాధ్యత, మనుషుల పట్ల ఆర్ద్రత, జీవుల పట్ల కారుణ్యం, ఉన్న కవయిత్రి పి.శ్రుతి. భావాలను చెప్పడానికి మంచి పోలికలను రూపకాలను ఉపయోగించగల శక్తి ఉంది. అందుకు భాషా సామర్థ్యాన్ని పెంచుకొని ముందుకు సాగితే ఈ వర్ధిష్ణువు వర్తమాన కవయిత్రిగా నిలదొక్కుకుంటుంది. అందుకు తగిన కృషి శృతి చేయాలని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ, సహృదయములను కవితా సంపుటిలోకి ఆహ్వానిస్తూ సెలవు.

– డాక్టర్ లక్ష్మణ చక్రవర్తి

# అక్షరబంధం

అక్షరాలతో స్నేహం చేసినప్పుడే కవిత్వమంటే ఏమిటో అర్ధమయింది. కాలంతో కదిలే నా కలం నన్ను నాకు పరిచయం చేసింది. ప్రతి అక్షరంలో ప్రతిబింబించేది నేనే, కానీ నన్ను ఆవహించి, ఆలోచింపజేసేది మాత్రం 'అక్షరం'.

ఇది నా మొదటి ప్రయత్నం. కొత్త తోవలో నడవడం మొదలుపెట్టిన కొత్త ప్రయాణం. భయపెడుతున్న చీకటిని వదిలి, ధైర్యాన్నందించే వెలుగులోకి వేసిన తొలిఅడుగు. ఈ ప్రయాణంలో కొత్త పాఠాలు అవగతమయ్యాయి. చిన్నగా అక్షరాలతో చేసిన స్నేహం పెద్దయ్యి జీవితపు పొరల్ని పెకిలించింది. రాజీపడుతున్న రాతకి గుండెగదిలో అలజడి మొదలయినా, ప్రజ్వలగీతం పాడకుండా, బంధంపై నిరీక్షణ నిలుపుకొని, స్నేహగీతి స్మరించుకుంటూ, కవిత్వానికి జీవితఖైదిని అవుదామనుకున్నా.

కానీ ఆమె ఎవరు, తన అశ్రుకావ్యం ఏమిటని, నాది అనుకునే నీకోసం, ప్రపంచపు అజ్ఞాతవాసులు అనంతపు ఆకాశంలో లోపలిదృశ్యాన్ని చూసి, రైతన్న నాగలి లాంటి పదునైన ప్రశ్నలు పొదలగుంపులో నుండి పరుగువందెంలా నన్ను వెంటాడుతున్నప్పుడు, అభినేత్రినై వారి మదిలో ఉన్న, అంగన అయితే ఏంటి అనే యూనివర్సల్ పదానికి, నిష్క్రమణం దారిచూపించాలని, కదలిరండి! మీరేరావాలి అని ప్రజలు నన్ను అడిగినప్పుడు, అంబేద్కర్ గారి మాటలు గుర్తుకువచ్చి, జ్వాలాతోరణం పట్టుకొని, మీరందరూ జోహార్లు అంటుండగా, నేనేం అవుతానో అన్న భయం నన్ను బాధిస్తుండగా, బ్రదర్ నాకు తోడుగా వచ్చి, నన్ను నడిపిస్తుంటే ఆ ధైర్యాన్ని నేనెలావర్ణించను? వర్ణించలేను అవర్ణం. నా చివరిక్షణాలు కూడా వియోగవేదనతో జారిపోతాయనుకున్నా. కానీ, నా కలానికి

కాలం నిలిచిపోయింది. నా ఆనందం అనంతమైంది.

ఈ కవిత్వపు ప్రయాణం మొదలుపెట్టిన నాకు, మొదటి మెట్టు ఎక్కాలో, వద్దో అన్న భయాందోళనలతో ఉన్న నన్ను, భయమేమిలేదు, సంకోచించకుండా వచ్చేయి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుతూ అడుగు కదుపు. నీమీద నీకున్న నమ్మకాన్ని మరింతగా నమ్మి, అడుగుముందుకేయి అని, తన హస్తాలను నాకందించి, అంధకారపు తోవలో వెలుగు నింపిన దీపమే 'సంధ్యాదీప్తి' గారు.

నా ఆలోచనలకి రూపాన్నిచ్చి, పుస్తక అందాన్ని మరింతగా పెంచిన వ్యక్తి 'లింగంపల్లి వెంకటేశ్' అన్నయ్య గారు.

కవిత్వమనే పేరు విన్నప్పుడు, కవిత్వాన్ని చదవాలి అన్న ఆరాటం కలిగినప్పుడు, పుస్తకపఠనం అలవాటే, కవిత్వానికి నన్ను చేరువచేసింది. 'ఒక్క సిరా చుక్క వంద మెదళ్ళ కదలిక' అన్నారు కాళోజి. 'ఒక మంచి పుస్తకం వందమంది మిత్రులతో సమానం' అన్నారు అబ్దుల్ కలాం. అలాగే 'ఒక ఉన్నతమైన పుస్తకం చాలు జీవితాన్ని మార్చేయడానికి' అంటాను నేను. అలాంటి కొన్ని పుస్తకాలే నన్ను మార్చేసాయి. మారిన నా వ్యక్తిత్వం నాలో కొత్త ఆలోచనలు రేకెత్తాయి. ఆ ఆలోచనలే 'నేనెలావర్ణించను' అంటూ మీ ముందు నన్ను నిలిపాయి.

**– శృతి పంగ**

CHIEF EDITOR:
Dr. K. Sandhya Deepthi

ILLUSTRATIONS BY:
Lingampally Venkatesh

# *Letter to the Readers*

To exist, is to create. We wish our young souls to become creators of stories —stories that talk that sing, that move; stories that show and wish to be seen. School of Emerging Writers is enthralled by the essential vision, which is to democratise creativity: to let the minds of our up-and-coming generation of story-tellers delve into every possible dimension of thought, to let their imagination unfold the 'very own' narratives and to let their expression be channeled around ways which leave a liberal room to manoeuvre in the process of self-discovery.

The Book-Writing Project is keen to reconnoiter the process of sharing common imagination and how such a united creative spirit eventually shapes assertiveness among students towards thought. Academics establish strict frontiers; sometimes, institutionalise the charisma of growing and learning within the classroom contexts. Nevertheless, no one is better than a mentor who can map through the mental geography of student community. As a diverse range of skills among students are ceasing to evolve due to a lack of diversity in opportunities— primarily in the arts — one needs to choose to be disquiet about limiting someone's potential by not creating opportunities. Because, as teachers and leaders, we need to create spaces; spaces that accommodate all variety of talents. For that reason, an initiative as this becomes instrumental in constructing one's own creative capabilities outside the traditional framework of academics; discovering and trusting their own selves as capable individuals. We therefore, dream of a liberal space where the boundaries of language, of genre and of subject are discerningly alleviated, helping students stand up to their own individual and collective anxieties.

The famous martial artist, cultural icon and often ideally referred to as "artist + philosopher", Bruce Lee states, "You must be shapeless, formless, like water. When you pour water in a cup, it becomes the cup. When you pour water in a bottle, it becomes the bottle. When you pour water in a teapot, it becomes the teapot. Water can drip and it can crash. Be water, my friend." 'To be water', as Bruce Lee unequivocally suggests, be the life-force of this endeavour; be immeasurably accommodative of everything and every infinitesimal idea sparkling far away in the imaginative minds of this young generation. Discover the brightest and the farthest stars.


Dr. K. Sandhya Deepthi
Coordinator,
School of Emerging Writers,
TGSWREIS.

| S.No. Title | Page. No. |
|---|---|
| 1. ఏం అవుతానో? | 1-3 |
| 2. పాతపాట | 4-5 |
| 3. యూనివర్సల్ | 6-7 |
| 4. అజ్ఞాతవాసులు | 8-9 |
| 5. అవర్ణం | 10-11 |
| 6. నిష్క్రమణం | 12-13 |
| 7. జీవితపు పొరలు | 14-15 |
| 8. బ్రదర్ | 16-17 |
| 9. లోపలిదృశ్యం | 18-19 |
| 10. అంబేద్కర్ | 20-21 |
| 11. పొదలగుంపులు | 22-23 |
| 12. అక్షరబంధం | 24-25 |
| 13. అంగన | 26-27 |
| 14. చుట్టరికం | 28-29 |
| 15. అనర్థాలం | 30-31 |
| 16. బంధం | 32-33 |
| 17. రైతన్న | 34-35 |
| 18. వియోగవేదన | 36-37 |
| 19. మీరే రావాలి | 38-39 |
| 20. నేనెలా వర్ణించను? | 40-41 |
| 21. జోహార్లు | 42-43 |
| 22. నీ కోసం | 44-45 |
| 23. ఓటమి | 46-47 |
| 24. కదలిరండి! | 48-49 |
| 25. జ్వాలాతోరణం | 50-51 |
| 26. తడి ఆరని కన్నులు | 52-53 |

| S.No. | Title | Page. No. |
|---|---|---|
| 27. | నిలిచిపోయింది | 54-55 |
| 28. | అభినేత్రి | 56-57 |
| 29. | కవిత్వం | 58-59 |
| 30. | ఆమె కవిత | 60-61 |
| 31. | జీవితఖైదు | 62-63 |
| 32. | ప్రియురాలు | 64-65 |
| 33. | అలజడి | 66-67 |
| 34. | నిరీక్షణ | 68-69 |
| 35. | పరుగుపందెం | 70-71 |
| 36. | ఆమె ఎవరు? | 72-73 |
| 37. | అనంతపు ఆకాశం | 74-75 |
| 38. | చిన్నది పెద్దదయ్యింది | 76-77 |
| 39. | నాది | 78-79 |
| 40. | రాజీవడ్డ రాత | 80-81 |
| 41. | స్నేహగీతి | 82-83 |
| 42. | ప్రజ్వలగీతం | 84-85 |
| 43. | నీతోడు | 86-87 |
| 44. | అకేలా! | 88-89 |
| 45. | స్నేహమేరా... | 90-91 |
| 46. | మాత | 92-93 |
| 47. | కాలం | 94-95 |
| 48. | ప్రయాణం | 96-97 |
| 49. | అశ్రుకావ్యం | 98-99 |
| 50. | చివరిక్షణాలు7 | 100-101 |

# 1. ఏం అవుతానో?

నేనేం అవుతానో?

కాలంలో కలిసే

కలనౌతానో?

ఒంటరిగా మిగిలే

శిలనౌతానో?

ఏం అవుతానో?

సముద్రపు కెరటాన్నౌతానో?

ఎగిసిపడి అలసిపోయిన

నీటి బిందువునౌతానో?

ఏం అవుతానో?

పసిబుగ్గల పెదాలపై

చిరునవ్వునౌతానో?

వారి కంట్లోంచి జారే

కన్నీరునౌతానో?

ఏం అవుతానో?



పుష్పించే కుసుమాన్నౌతానో?

రాలిన చెట్టు ఆకునౌతానో?

నేనేం అవుతానో?

కలత చెందిన కునుకునౌతానో?

కనులు మూసే కలనౌతానో?

ఏం అవుతానో?

కవి కలంనుండి జాలువారే

అక్షరాన్నౌతానో?

అక్షరం పదాలుగా మారి

విమర్శించే గొంతునౌతానో?


ఏదేమైనా నేనొక

అద్భుతాన్ని అవుతా.

# 2. పాతపాట


నా పాట పాతవడ్డది,
సూరీడు, చంద్రుడు
యేర్పడ్డప్పుడే
నా పాట పాతవడ్డది.
నా తల్లి రొమ్ముిన
నిజాంగాడు దించిన తూటాలకు
నా పాటకు చిల్లులు వడ్డయి
గప్పుడే, గప్పుడే
నా పాట పాతవడ్డది.
నా దేశాన్ని చీరలెక్క
రెండుగా చీల్చినప్పుడే,
నా పాట పాతవడ్డది.
గప్పుడే, గప్పుడే
నా పాత పాతవడ్డది.
సరిహద్దుల కాడ
నా కొడుకులు సచ్చిపోయినప్పుడే
నా పాత పాతవడ్డది.
మునేళ్ళతోటి నాగరికత
నేర్పిన నా పాటని
గీ సమాజం ఏలెత్తిసూపినప్పుడే
నా పాట పాతవడ్డది.

గీ ప్రపంచానికి
నా పాట అక్కర్లేదని
ఎలేసినప్పుడే
నా పాట పాతవడ్డది.
గప్పుడే, గప్పుడే
నా పాట పాతవడ్డది.
పాడి పాడి
నా పాట పాతవడ్డది.



# 3. యూనివర్సల్

ప్రతిబింబించే బింబాన్ని నేను
అణువులో అద్దాన్ని నేను
శబ్దతరంగాల సవ్వడి నేను
పరిమళించే కుసుమాన్ని నేను
భూతకాలపు జ్ఞాపకాన్ని నేను
వర్తమానపు మనిషిని నేను
సత్యం అసత్యాల స్వభావాన్ని నేను
ధర్మం అధర్మాల కలయిక నేను
నీతి అవినీతుల సమ్మేళనం నేను
పూరిగుడిసెలో వీచే గాలిని నేను
రంగస్థలంలో కూరుకుపోయిన నటిని నేను
ఆయుధం కొనమీద రౌద్రాన్ని పెంచిన
రక్తపు చుక్కను నేను
ప్రజలకంట్లో నలుసుని నేను
చరిత్రపుటల్ని తిరగరాసే కవయిత్రిని నేను
ముగ్గులను చూసి నవ్వే ముంగిలిని నేను
నిరాశ, నిస్పృహల లోతుని నేను
సంపన్నుల భవనాల్లో అగౌరవాన్ని నేను
సమాజంలో విలువని నేను
ఆలోచనలకు, ఆత్మీయతకు
మధ్య ఉన్న బంధాన్ని నేను
అక్షరాన్ని నేను
అఖిలాండాన్ని నేను.




12
9
3
6


# 4. అజ్ఞాతవాసులు

అనుకున్నాను
మీరు ఇంతే అని
ప్రపంచంలో ఎవరు మారినా
మీరెందుకు మారతారులే?
ప్రపంచం మీ సొత్తు
అనుకుంటే ఎలా?
ప్రజలందరిది ఓ క్యాలుక్లేషన్ లైఫ్ మరి.
మీరు అజ్ఞాతవాసులు కదా!
సమాజం గురించి మీకేం తెలుస్తుంది?
ప్రపంచం ఒక పద్మవ్యూహం
అయినా,
మీ ప్రభావం మమ్మల్ని వదల్లేదు
అయినా ప్రపంచం గురించి
మీకేం తెలుసులే?
నిజానికి ప్రపంచానికి మీరే బానిసలు.

# 5. అవర్ణం

అడుగుల అలవోకలో
కదిలిన అందం అది
మోము నుండి జారిన
తన చెమటచుక్క
ముత్యమై మెరిసింది.
ప్రపంచం ఒక ఎత్తైన,
తన పరిజ్ఞానం ఇంకో ఎత్తు
నిశ్చలనిధి తన మనసు.
నీకు నాకు మధ్య ప్రేమగోడలున్నాయి
ప్రియతమా!
నీ అందం అవర్ణం
నీకే నా దాసోహం.





# 6. నిష్క్రమణం

అశ్రువులు అడుగంటుతున్నాయి
ఆశాజ్యోతి ఆరిపోతుంది
కాలం కనుమరుగౌతుంది.
ఆగిపోయిన గుండెని
గాయపరిచిందెవ్వరు?
ఆ చిరునవ్వును
చెదరగొట్టిన వారెవరు?
ఆస్థికులా? నాస్థికులా?
ఎదురైన నీటిచెమ్మ
ఊపిరి ఆగిన ఆ గొంతుకు
ఆనవాలు వెతకసాగాయి.
అలసిసొలసిన ఆ దేహం
మృత్యువు ఒడి చేరింది.

# 7. జీవితపు పొరలు

జీవితపు పొరలు

పలుచగా మారాయి.

ఒక్కో పొర ఒక్కో చేదు

జ్ఞాపకాన్ని మిగుల్చుతున్నాయి.

కాలాన్ని, కాలదన్ని

ముందుకు పరుగుతీసే

నా అడుగులకు

సంకెళ్ళు పడ్డాయి.

ఒక్కొక్క దెబ్బ జీవితపు

పొరాల్నే కాదు,


గుండె బరువుని కూడా పెంచుతున్నాయి.

జీవితపు పొరలు

పలుచగా మారాయి,

ఏ పొరైనా మిగిల్చింది దు:ఖమే!





# 8. బ్రదర్

ఉదయమారుతంలో
పైడి వీణలా ఉన్న నన్ను,
నీ మునివేళ్ళతో తడిమి ప్రాణం పోశావు.
శూన్యపు సంద్రంలో ఓ నీటిచుక్కనై
బిక్కుబిక్కుమంటుంటే
నా ఒంటరితనాన్ని చీల్చడానికి
నదిలా నా దరిచేరావు.
నాలోని ఆశలు ఆవిరవుతున్న ప్రతిసారి
దీపంలా వెలుగుతూ,
నాలో ఉత్సాహాన్ని నింపుతావు.
అంధకారంలో అజ్ఞానంతో కొట్టుమిట్టాడుతున్న నన్ను,
వెలుగులోకి చేర్చి జ్ఞానాన్ని పంచావు.
ఇనుపతీగల్లో నా ఊపిరి ఇరుక్కుపోయినప్పుడు
విలాసంగా వీచే గాలుల్ని సమాంతరంగా మలిచి
స్వేచ్ఛగా నాకందించావు.
నీ శరీరంలోని ప్రతిరక్తపు బొట్టుని కలిపి
నాలో చైతన్యాన్ని నింపుతున్నావు.
నిశిలాంటి నా జీవితంలో
శశిలా తోడుంటున్నావన్నయ్యా
నా ఈ జీవితం,
నీకు అంకితం.


# ౨. లోపలిదృశ్యం

ఎవరు నియంత్రిస్తున్నారు
నల్లమబ్బుల్ని?
ఎవరు చెరిపేస్తున్నారు
కన్నీటి ఆనందాల్ని?
గుప్పెడు గుండెలో
ఇమడని గోసకి ద్వారాలెన్నెన్నో?
బతుకుల మీద
విషాగ్నులు విడిచిన
ఆ విషసర్పాలెవరు?
నెత్తుటి డొక్కలో కుల్లిన
ఎముకల్ని లెక్కించినవారెవరు?
ఎండిన చెరువులు
రాజుకున్న చితిమంటలకు నిదర్శనం.
దు:ఖస్పర్శ విస్తరిస్తున్నా,
ఉదయసంధ్యలు మాత్రం వెనక్కిమలగలేదు.



# 10. అంబేడ్కర్

ఓ సూర్యుడా!
మళ్ళీ ఉదయించు.
అజ్ఞానం అనే అంధకారాన్ని తొలగించడానికి,
మళ్ళీ ఉదయించు.
ప్రభుత్వం పిడికిట్లో ఉన్న
ఊపిరిసలుపలేని జీవితాల్ని నిర్బంధించడానికి,
మళ్ళీ ఉదయించు.
రాజకీయుల వంచనలకి
చరమగీతం పాడడానికి
మళ్ళీ ఉదయించు.
ఓ సూర్యుడా!
మళ్ళీ ఉదయించు.
దరిద్రపు నదిలో కొట్టుమిట్టాడుతున్న
శ్రమజీవులను వెలికితీయడానికి,
మళ్ళీ ఉదయించు.
కష్టజీవుల బ్రతుకుల్లో నిండిన
చీకటిని చీల్చడానికి,
మళ్ళీ ఉదయించు.
అమ్మకాలకు అలవాటుపడిన
ప్రభుత్వాల్ని శుద్ధి చేయడానికి,
మళ్ళీ ఉదయించు.




ఓ సూర్యుడా!
మళ్ళీ ఉదయించు.
అంటరానితనాన్ని రూపుమాపడానికి,
మళ్ళీ ఉదయించు.
ఓటు అనే ఆయుధాన్ని పదునుపెట్టడానికి,
మళ్ళీ ఉదయించు.
అస్తమించిన దళితుల బ్రతుకుల్లో,
సూర్యుడవై మళ్ళీ ఉదయించు.
ఓ సూర్యుడా!
మళ్ళీ ఉదయించు.

# 11. పొదలగుంపులు

దట్టంగా కమ్ముకున్న పొదలగుంపులు
అందులో నేను ఒంటరిని.
ప్రతి ఒక్క పొదలగుంపు
అగ్నికణాల్లా రగులుతున్నాయి.
ఓ పొదల గుంపు దగ్గరికెళ్ళాను,
ముళ్ళడొక్కల్లో నిండిన డబ్బు అనే
ఆయుధాల్ని ప్రదర్శిస్తూ
నాపై దూకబోయింది.
ఇంకో పొదలగుంపువైపు చూశాను
ఆడదానిమీద జరిగిన అత్యాచారాలను
నగ్నంగా చూపిస్తూ,
నన్ను వెనక్కి నెట్టింది.
మరో పొదలగుంపువైపు నడిచాను
వరకట్నమనే రాక్షసి నోరుచాచుకొని కూర్చుంది.
ఓ పొదలగుంపువైపు చూపుసారించాను
వేదనలతో పండిన గుండెలను
లెక్కిస్తూ నన్ను వెక్కిరించింది.
ఆ పొదలగుంపులన్ని నా దరికిచేరి
మీ ఒంట్లో రోగాలున్నాయి

అందుకే ఘోరాలు చేస్తున్నారు.
మీరు వాయువులై
ఆయువులు పోయండి
ఖడ్గానికి కాదు, కలానికి పదును పెట్టండి.
అప్పుడే నెత్తురుగుండెలు పగిలిపోవు
కన్నీటి హృదయాలు చిట్లిపోవు
అంటూ నిట్టూర్చి నా నుండి కదిలాయి
ఆ పొదలగుంపులలో
నేనో ప్రశ్నార్థకంగా మిగిలాను.









# 12. అక్షరబంధం

ఉదయం లేచేటప్పటికి
అక్షరం నా పక్కనే కూర్చుంది,
కాస్త చిక్కినట్టుగా కనిపించింది.
నన్ను వదిలేస్తున్నావా? అంటూ,
దీనంగా నా వైపు చూసింది.
మౌనం నన్ను ఆవహించింది
నా మౌనాన్ని ముక్కలు చేయడానికి,
పదునైన ప్రశ్నలు వెతుకుతుంది.
ఏదో ఒక ప్రశ్న తళుక్కున మెరిసినట్టుంది
నావైపు ఓరగా చూసి,
నేనెవరో తెలుసా? అన్నది.
శూన్యంలో కూడా
వెలుగునిచ్చే కిరణాన్ని.
వేల మైళ్ళ చరిత్ర పుటలకు
ప్రాణం పోసిన మాతృమూర్తిని
కోట్ల ప్రజల జీవితాలను
మార్చేసిన కరెన్సీని
గుప్పిట్లో నాగరికతను
దాచిన ధైర్యురాలిని.

శబ్దతరంగాలకు కొట్టుకుపోకుండా
నిలిచివున్న అక్షరాన్ని.
తన సమాధానాలకు నేను
వణికిపోయాను.
మిత్రమా అయినా నువ్వు
నన్ను వీడలేవు
ఎందుకో తెలుసా? అంటూ,
నా సమాధానం కోసం నిరీక్షిస్తుంది
తన నుండే నేను సమాధానం
నోచుకున్నాను.
వెలుగు - నిశిల స్నేహం మనది
ఆకాశం - మేఘాల రూపుమనది
బతుకు - రంగుల పాటమనది
అంతకుమించి అక్షరబంధం మనది అంటూ,
నాతో అల్లుకుపోయింది.

## 13. అంగన

నిన్ను చిదిమేస్తున్నారని
కృంగిపోకు
శిక్షిస్తున్నారని చింతచెందకు
చిరువెలుగులోనే
వేల జీవితాలను నిలిపే ఘనత
నీ సొంతం.
నీ ఆశయాలను తుంచేస్తున్నారని,
బెదిరిపోకు.
నీ ఆనందాలను అత్యాచారం
చేస్తున్నారని ఊపిరాపకు
రేపటితరానికి ఊపిరిపోసే
మాతృమూర్తివి నీవు.
బతుకు భారమైందని
బాధలకు లొంగిపోకు
రోజూ చస్తూ బ్రతుకుతూ
జీవితాన్ని గడపకు
చచ్చిపోతూ బలవంతంగా బతకకు.
పెనుగాలులు ఎన్ని వీచినా
అవరోధాల నదిలో ఈదుతూ
ఆటంకాలని అధిగమించు.
మానవాళిని కాపాడే
మగువవు నీవని మరువకు.



# 14. చుట్టరికం

నగరంలో ఓ రోడ్డుపక్కన
ఆకలి ఆకలి అనే మాటలు
శ్రవణులను తాకాయి.
ఎవడా దరిద్రుడు అని
వెతకడానికి నా కాళ్ళు కదిలాయి.
చిరిగిన బట్టలు మాసిన గడ్డంతో
ఓ అనామకుడు కనిపించాడు
వాడెవడో కాదు
భరతమాత సుతుడు
సాధారణ సామాన్యుడు
వాడి దరిద్రం,
ఆకలి జ్వరంతో పోరాడుతుంది.
అకస్మాత్తుగా వాడు పోయాడు
ఆ అగాదాన్ని పూడ్చుడానికి
పిడికెడు మట్టి చల్లడానికి
ఓ మనిషి కావాలి.
వాడికి ఎవరైనా
చుట్టాలొస్తారేమోనని వీక్షిస్తున్నాను,
సామాన్యులందరికి దరిద్రమే చుట్టం.

ఆ దరిద్రానికి ఇంకో

సామాన్యుడి ఆనవాలు దొరికాయేమో!

అందుకే,

చుట్టం చూపుకు రాలేదు.

వాడి దరిద్రపు చుట్టరికం,


దీనితో తెగిపోయింది.



# 15. అనర్ఘ్యలం

నీ చిరునవ్వుకు ఈ లోకంలో
ఎవరు కారకులు కాకపోవచ్చు
కానీ,
నీ అశ్రువులకు మాత్రం
ప్రత్యక్ష కారకులం మేము.
నీ మూగ గుండెలోని వ్యధకు మేము కారకులం.
అశాంతి నిండిన చీకటి బతుకులోని
అఘాయిత్యాలకు మేము కారకులం.
నీ శరీరం మీద అయిన ప్రతి గాయానికి
మేము కారకులం.
నీ రక్తపు కన్నీళ్ళకి మేము కారకులం.
మానవత్వాన్ని చంపి నీ మెడలో
పసుపుతాడు వేయించిన
సందర్భానికి మేము కారకులం.
ఈసడింపు బంధాల్లో కూరుకుపోయిన
నీ అచేతనపు స్థితులకు మేము కారకులం.
కంకరరాళ్ళ మధ్య మందారపు పువ్వులా నలిగిపోయావు!
బాధను, గుండె భారాన్ని, కన్నీటిని కలిపి
ఆయుధంగా మలచి, ఆ ఆయుధానికీ
నీ రక్తపుచుక్కల్ని రుచిచూపావు.
నీ మరణానికి మేమందరం బాధితులమే!

వేలుపట్టి నడిపించిన వారు
నిన్ను ఆదుకోలేదు
వేలుతో వేలు ముడివేసినవాడు
నీకు తోడుగా నిలబడలేదు
అవును నీ మరణానికి కారణం మేమే
కానీ,
మా కన్నీటితో నీకు వీడ్కోలు
పలకడానికి మాత్రం మేము అనర్హులమే!



# 16. బంధం

ఒకటా రెండా!
ఎన్ని సంవత్సరాలు గడిచిపోలేదు
తన కళ్ళముందు
ఆత్మీయబంధం మొదలయినప్పటి నుండి
తనవాళ్ళు దూరం అయ్యేంత వరకు.
ఒకరా ఇద్దరా!
ఎంతమంది విడిపోలేదు
రెప్పవేసే నిమిషంలో
పంచభూతాలల్లిన బంధాన్ని
పటాపంచలు చేసుకున్నవాళ్ళు
ఎంతమందిలేరు?
అస్థిత్వానికైనా, అచేతనానికైనా,
కాలపరిమితి అంటూ లేదు
జీవితకాలం ఉండాల్సిందే.





# 17. రైతన్న

హాలికుడా!

నీ అవయవాలు తెగి రక్తం స్రవించిన,

ఆ రక్తాన్ని నువ్వు పైరుపంటకు

నీళ్ళలా మార్చుతావు.

ఆకలిసెగలు నీకెక్కడ తారసపడినా,

అమ్మవై ఆకలి తీర్చుతావు.

నీ క్షేత్రంలో కాంతులు మూగబోతే

నువ్వు నీ చమటను దీపంలా వెలిగిస్తావు.

జీవనగమనంలో నీ పాటంతా పైరే!

మొలకెత్తిన మొక్కలే నీకు ముత్యాలు.

నీ దున్నుకతో భూతల్లి

మళ్ళీ పురుడుపోసుకుంటుంది.

కారడవిలోయలో చిమ్మచీకట్లు కమ్మి

ప్రపంచం అంతా నిద్రపోయినా

కంటిమీద కునుకులేకుండా

కార్యసాధకుడవై నీ కార్యాన్ని విజయవంతం చేస్తావు.

ఓ కర్షకా!

అందుకో మా వేవేల వందనాలు.


# 18. వియోగవేదన

ఎందుకో? నీ వియోగం
నన్ను దహించివేస్తుంది
నా చెంతన నువ్వులేక
నా జీవితం శూన్యమైపోతుంది
నా ఆశలకు ఊపిరిపోసిన నువ్వే
నాకు దూరమైతే
నా ఊపిరి ఆగిపోయినట్టుంది
నీ అడుగులకు అడ్డుపడతానేమోనని
ఆగిపోతున్నాను
అందుకే, నీ వియోగం
నన్ను దహించివేస్తుంది
ఈ పరిగెత్తే కాలానికి సిగ్గులేదు
నన్ను నీకు దూరం చేస్తుంది
ఛీ, ఈ సమయం ఇప్పుడే ఆగిపోని
ఈ వియోగం నాతోనే అంతమయిపోని.



## 19. మీరే రావాలి

ఏం మనుషులండి మీరు?
కళ్ళముందు జీవితాలు చీకటైపోయినా,
ఉలుకు పలుకు లేకుండున్నారు
ప్రభుత్వం ప్రాణాలు తీస్తుందని
వెనుకంజ వేస్తున్నారా?
అయినా,
ప్రజారంజక పాలన ఎక్కడుందని?
ప్రభుత్వాలు పాలిస్తున్నాయా?
పదవి వ్యామోహంలో ఉన్న
మృగాలు పాలిస్తున్నాయా?
ఏం బ్రతుకులండి మీవి?
ఏ ఉద్యమయోగి రావాలో
ఎంతమంది పోరాటయోధులు రావాలో
ఎంతమంది దాశరథులు వచ్చినా
మీ బ్రతుకులు మారతాయా?
ఎవరో వస్తారని
ఆశలు ఎందుకు?
మీరే రావాలి
మీరే ఉద్యమకారులు కావాలి
మీరే కొత్తరాత రాయాలి
మీరే కొత్తచరిత్ర సృష్టించాలి.






## ౨౦. నేనెలా వర్ణించను?

ఎవరినైనా వర్ణించగలనేమో గానీ
ఆ మేధావిని ఎలా వర్ణించను?
జైలు గోడలమీద రచనలని
ప్రజలగుండెల్లో రగిల్చాడు.
అడుగడుగునా అణువణువునా
వీరత్వాన్ని నింపుకున్నాడు.
కష్టాల వాతావరణంలో పెరిగి
దారిద్ర్యంలో కార్చిచ్చు రాజేసాడు.
నేనెలా వర్ణించను?
చరిత్రలో ఇంకిపోయిన
ఉద్యమాల్ని లేవనెత్తాడు.
భయంతో ముకుళించుకుపోయిన
ఎన్నో స్వరాలకు గళాలనందించాడు.
బందిపోట్లకు గురైన రక్తమాంసాల్ని
చైతన్య రథమెక్కించాడు.
నేనెలా వర్ణించను?
నోరెత్తి, హోరెత్తి, గళమెత్తి
పయనమయ్యాడు.
చీకటిదీపాల్ని వెలిగించిన
యోధుడయ్యాడు.
దోపిడి, దౌర్జన్యాలను
కంటిచూపుతో శాసించాడు.
నేనెలా వర్ణించను!
మానవుడైతే వర్ణించగలనేమో...
మహాత్ముడయినాడు వర్ణించలేను.

# 21. జోహార్లు

స్త్రీలుగా పుడితిరి
అంధకారాన్ని వెలివేసితిరి,
అలుపుల్లో గెలుపుల్లో
ఓడిన మలుపుల్లో
అంగనలై తోడుంటిరి
ఇంతులై ఇల్లాలైతిరి
పడతులుగా మారి
ధైర్య సాహసాలకు అద్దం పడితిరి
మహిళలై భ్రష్టుపట్టిన
సమాజాన్ని శుద్ధి చేసితిరి
కవి కలం నుండి
గళం ఎత్తిన మగువలైతిరి
అందుకే,
ఆడవాళ్ళు మీకు జోహార్లు!









# 22. నీ కోసం

నీ కోసమే
వేచివున్నానిలా
జీవన నిర్మాణంలో
మనది ఎదురీత
స్వర్గాలు కరిగిన
స్వర్ణాలు పగిలిన
నీ కోసం ఎదురుచూపు నిలవదు
నీ కోసం నేనో కవిత రాయనా? మిత్రమా!
అద్భుతాలు ప్రపంచంలో ఉన్న
ప్రపంచం నీలో ఉంది.
క్షణకాలం కాదు
జీవితకాలం ఉండిపోవా నువ్విలా.

## 23. ఓటమి

ఆనందాలు విరిసిన ఆ ఇంట్లో
కన్నీళ్ళు మొదలయ్యాయి
ప్రతికన్నీటి చుక్కకి కారణం ఆయనే
జీవితాధ్యాయంలో ఎన్నోసార్లు ఓడాడు
మృత్యువుతో చివరివరకు పోరాడి
ఇప్పుడు ఓడిపోయాడు.
ఈ ఓటమి ఆయనకేం కొత్తది కాదులే
ముళ్ళకంచెలాంటి బతుకులో
ఎన్నోపూలు పూయించాడు.
మధ్యతరగతి కౌగిట్లో ఊపిరాడకున్నా
ఉదయకిరణాల్ని వెలిగించాడు.
అశ్రుకణాలలో చేజారిన ఆనందాల్ని
అక్షరం అక్షరం పోగుచేసి ఏరుకున్నాడు.
ఇన్ని ఘనతలకు కర్త, కర్మ, క్రియ
అన్నీ ఆయనే
కానీ,
నేడు తుదిపోరాటంలో ఓడారు.
ఆ మహాకవి వెళ్ళిపోయాడని
మహాప్రజ్వలం ఆరిపోయింది.





## 24. కదలిరండి!

కదలిరండి!

జనులారా,

కదలిరండి!

శ్రమజీవుల కండరాల కష్టాన్ని

అపహరించే దోపిడి పరిపాలనని

కూలదోయగా కదలిరండి!

అడుగుముందుకేయండి

ప్రజలను తోలుబొమ్మల్లా మార్చుతున్న

రాజకీయనాయకులను ఊపిరిపీల్చే

క్షణాలలో ఏరిపారేయండి

పదవి వ్యామోహంతో

ప్రజలను పాలిస్తాడు ఒకడు,

ప్రభుత్వం నాదే అని

ప్రజలను శిక్షిస్తాడు ఇంకొకడు.

ఒకరై

పదుగురై

వందలుగా చేరి

వేలుగా మారి

కదలిరండి!

జనులారా,

కదలిరండి!

# 25. జ్వాలాతోరణం

ఆహుతికి ఆకలి తీరలేదు
అందుకే, నెత్తుటిగీతం మొదలయింది.
రౌద్రజలం జ్వలిస్తుంది
ఆకలిమంటల అరుపులు
అంబరాన్నంటుతున్నాయి.
ప్రళయ ప్రజ్వలానికి
విళయవిశ్వం తోడయింది
ఆకలి, కన్నీటిని కూడా
బూడిద చేసింది.
ఆ బూడిద మాలలు
కడుపునింపే గూటికోసం
వేచిచూస్తున్నాయి.
ఆహుతికి ఆకలి తీరలేదు
ప్రజల ఆకలి తీర్చేమార్గం
అగుపించటం లేదు.



## 26. తడి ఆరని కన్నులు

ఏమమ్మ, గీ శవాన్ని
పక్కనవెట్కొని ఏం సోచాయిస్తున్నవు?
అడుగు కదపనివ్వని ఆయాసంతో
ఎటు కదులుతున్నావు?
ఏ గాయపడిన హృదయాన్ని
ఓదార్చడానికి బయలుదేరావు?
తడి ఆరని కన్నులతో
ఎవరి సహాయం కోసం వీక్షిస్తున్నావు?
ఈ మనుషుల నిండా స్వార్థం నిండుకుంది
చేయిచాచి అర్థించినా,
అడుగు ముందుకేసి సహాయం చేసేవారెవరులేరు
జనజీవన ఊయలలో
'నాకేంటి' అనే మాటే ఊతపదమయింది
అలాంటిదమ్మా ఈ సమాజం
అయినా ఈ సమాజం గురించి
నీకు వార్తలందలేవా?
గుండెలో ఉన్న నెత్తురు కళ్ళలోకచ్చినా
ఏకాకి 'ఏ' కాకి సాయం చెయ్యదు నీకు.

ఓ తల్లి! ఈ దేశం
నిన్ను కనిందేమోగానీ
ఈ సమాజం నిన్నెప్పుడో విడిచిపెట్టింది.
ఈ మనిషిని పాతిపెట్టడానికి
నీకో మనిషి కావాలి
నేనొస్తా పద నీవెంట
బొందతవ్వి, ఆ మనిషినే కాదు
బూటకపు విషాల్ని రాచరికాన్ని,
రాజరికాన్ని అంతస్థులమీద
ఆడుతున్న అబద్దాల్ని పూడ్చి,
మట్టిచల్లి,
మౌనం పాటించుదాం రా తల్లి!



# 27. నిలిచిపోయింది

ఆ యువకుడు మరణించాడు
ఆకాశంలో ఓ తార వెలిగింది
ఆ యువకుడు మరణించాడు
సమాజంలో విలువ కనుమరుగైంది
ఆ యువకుడు మరణించాడు
రంగుల కలలు చెదిరిపోయాయి
ఆ యువకుడు మరణించాడు
ఎన్నో కర్తవ్యాలు ప్రశ్నార్థకంగా
మిగిలిపోయాయి
ఆ యువకుడు మరణించాడు
ఆగి, ఆగి ఏడ్చే కళ్ళు ఎక్కువయ్యాయి
ఆ యువకుడు మరణించాడు
నాగరికతలోని నరనరాలు బిగుసుకుపోయాయి
ఆ యువకుడు మరణించాడు
ఆ యువకునితోపాటు
యువత నిలిచిపోయింది.





# 28. అభినేత్రి

కథ నాది
కథనం నాది
ప్రపంచం నన్ను నటిగానే ఎరుగు
నేను నటిని కాదు, అభినేత్రిని.
నటన నా నరనరాల్లో ప్రవహిస్తుంది
భావపదజాలం నా సొత్తు
భావానికి రూపం నేనే
నాట్యమయూరి, నా పుట్టుక
సంగీతసారధి నా వంశం
నేను నటిని కాదు, అభినేత్రిని.
కణకణం అనుక్షణం
ఆవిర్భవించేదే నా నటన
నేను నటిని కాదు,
నేత్రిని... అభినేత్రిని.

## ౨౯. కవిత్వం

కవిత్వమంటే ఏమనుకుంటివోయ్?

రౌద్ర జలాన్ని కూడా రంగులతో నింపేదే కవిత్వం

వేళ్ళ సందుల్లోంచి ఎగిరిపోయే

కలలపతంగే కవిత్వం

బతుకుపాటలో ఆగినరాగమే కవిత్వం

కవిత్వమంటే ఏమనుకుంటివోయ్?

యుద్ధాన్ని తలమీదమోసే వీరుడి ధైర్యమే కవిత్వం

జీతం కాగితాల కోసం

జీవితాన్ని రగిలించేదే కవిత్వం

నీటిమీద రాయిగీసిన అందమైన చిత్రాలే కవిత్వం

అంతర్వాహినిలా పంచుకుంటున్న ఉప్పనే కవిత్వం

కవిత్వమంటే ఏమనుకుంటివోయ్?

వ్యక్తిత్వం అనే వెలుగుని కుప్పగా పోసేదే కవిత్వం

నెత్తురుబొమ్మను కూడా

ఆయుధం నీడన, అక్కున చేర్చేదే కవిత్వం

నమ్మకం పాతుకున్నవాని గుండెలో

తూటాలకి, మాటల్ని బదులిచ్చేదే కవిత్వం.

కవిత్వమంటే ఏమనుకుంటివోయ్?

విశ్వవిస్ఫోటనంలో పొడవని పొద్దే కవిత్వం

గుప్పెడు గుండెల్లో ఇమడనిదే కవిత్వం

దివిటీలపై దిక్కుల్ని


వెలిగించేదే కవిత్వం

కవిత్వమంటే ఏమనుకుంటివోయ్?

జారిపోలేని ఆశజీవనమే కవిత్వం


రగిలించే రంగులమంటే కవిత్వం

ఎంతటికి ఒడువని ముచ్చటే కవిత్వం.



## 30. ఆమె కవిత

ఆమె కన్నీళ్ళకి
కారణం నువ్వేనా?
తన నమ్మకాల మీద
ఆసిడ్ పోసింది మీరేనా?
రంగుల ప్రపంచాన్ని కూడా
రక్తంతో తడిపారు.
అందమైన కళలకు
కన్నీళ్ళను చేరువచేశారు.
వ్యవస్థ చెక్కిన శిల్పికేనా జీవితపోరాటం
కలం పట్టిన ఆ చేతికి
గొంతులో ఊపిరితప్ప
ఇంకేమి మిగల్చలేదు మీరు.
మోసాన్ని విషం చేసి
రోజు కొంచెం తినిపిస్తున్నారు.
అయినా,
ఆమె విసిరిన ప్రతి కవిత
సిగ్గులేని సమాజం గుండెల్లో
దింపిన డైనమేట్.







## 31. జీవితఖైదు

ఏ పదాలతో బంధించాలి నా బాధను?
ఏ ఆనకట్టను వేయాలి నా ఆవేదనకు?
నిలువెత్తునా నిండిన ఒంటరితనం.
అక్షరాలు కూడా, నన్ను ఆదమరిచాయంటే నమ్మండి.
సిరాచుక్క కూడా లేని అస్థిత్వం
ఎన్ని రోజులని ఏకరువు పెట్టను?
అందుకే పదాలతో బంధాలను తెంచుకుని
జీవితఖైదు అయ్యేందుకు పూనుకున్నాను.

# 32. ప్రియురాలు

తనకనులను చూస్తూ, కాలాన్ని గడిపేయవచ్చు
తన వక్రాన్ని చూస్తూ, ప్రపంచాన్ని మర్చిపోవచ్చు
అంతులేని సౌందర్యం ఆమే సొంతం
తన కరములతో నా జీవితాన్ని బంధించింది
బయటకు రావాలని లేదు, బందీగానే ఉండాలనుంది
ఆమె చిరునవ్వుకు ఏ భోగాలు సాటిరావు
తన శిరోజాన ప్రపంచ వర్ణాలను తురుముకుంది
ఆ సహనశీలి ఎవరో తెలుసా?
ఆ జవరాలు ఎవరో కాదు
నా ప్రియురాలు.







# 33. అలజడి

నా గుండెగదిలో
ఎందుకోమరి?
అలజడి మొదలయింది.
పార్థుడు ఈ సమాజంపై
అస్త్రాన్ని సంధించుతాడేమో
అందుకేనేమో అలజడి మొదలయింది
ఈ లోకం మానవత్వం మీదకి
విషసర్పాలను విడిచిపెట్టిందేమో
అందుకేనేమో అలజడి మొదలయింది
ఏమో? ఎందుకోమరి?
నా గుండె గదిలో
అలజడి మొదలయింది.

# 34. నిరీక్షణ

నువ్వు నన్ను ఇడ్సవెట్టి, వోయినకాడ్నుండి
గుండిగెల ముద్ద దిగుతలే
అమాసలాంటి నా జీవితంలో
నువ్వుంటనే ఎన్నెలొస్తది.
నా గుండెల నెత్తురు కాదు
కండ్ల నీళ్ళు నిండుతున్నాయి.
గవ్విటితోటే గుండెబరువైతుంది
నా బత్కునుసూశి గా శిమ్మశీకటి
గూడ నవ్వుతుంది
మాపటేల ఎదల జంకువుట్టింది
తోడుకోసం సూశిన
ఏకాకినని యాదికొచ్చింది
ఆకాశంను ఇడ్సవెట్టిన
చంద్రునిలెక్క ఎళ్లిపోయినవు
నా జీవితం నుంచి
ఎక్కెక్కి ఏడ్శిన రోజులెన్నెన్నో
నువ్వొచ్చేదాకా ఎదురుసూస్తునే ఉంటా
నేను కాటికి పోయేదాకా
ఈ ఎదురుసూపు ఆగది.





# 35. పరుగుపందెం

నా మాతృమూర్తి గర్భ కుహురాల్లోంచి
ఒక్కొక్క పొరను చీల్చుకుంటూ,
బయటికి వచ్చిననాడు
నా తల్లి ఈ అఖిలాండాన్ని
పరిచయం చేసింది.
అప్పుడే బతుకుబాటలో
నా పరుగుపందెం మొదలయింది.
పక్షిలా రెక్కలు చాచుకొని ఎగిరేలోపే
నా రెక్కలని రక్తపు ముద్దగా చేశారు
ఒక్కదడిమీద నిలబడే
సమయం కూడా లేకపోయింది
పరిగెత్తి పరిగెత్తి పాదాలు
పాతాళంలోకి పోతున్నాయి
ఒక్కో దశను త్యజించుకుంటూ
పయనమవుతున్న నా పరుగు
కాస్త తడబడుతుంది
నదిలా పరిగెడుతున్నా
ఒ(రైలల్ల, ఒంపులల్ల
నడుం వాల్చక పరుగెడుతున్నా
జీవితంలో విని, చదివి, రాసే
రాగాలన్ని నా పరుగుపందెంలోనే
అవగతమయ్యాయి.
అవిరామంగా పరిగెడుతూ ఉన్నా
ఈ పరుగుపందెంలో
గెలుపునన్ను వరించేవరకు
పరిగెడుతూనే ఉంటా.

## 36. ఆమె ఎవరు?

ఆమె ఎవరో మీకు తెలుసా?
స్వాతంత్రోద్యమాన్ని తలమీద
మోసిన ధీరురాలు తాను
'భగీరథుని' వాంఛ మేరకు
భువికి వచ్చిన 'గంగమ్మ' తాను
పరువుకోసం పుత్రున్ని
జలప్రవాహంలో వదిలేసిన 'కుంతి' తాను
రాజ్యంకోసం పిండాన్ని
కుండలో దాచిన 'గాంధారి' తాను
గుర్తుకు వచ్చిందా ఆమె ఎవరో?
శత్రువుల హృదయాల్లో కల్లోలం
సృష్టించి రక్తపు మడుగులో
రాజ్యాన్ని కాపాడుకున్న 'రుద్రమ'తాను
తనువులో అణువులో ప్రేమను
నింపుకుని వ్యాధి కారకులను
అక్కున చేర్చుకున్న 'మదర్‌థెరిస్సా' తాను
భూమికోసం గళం ఎత్తి
ఉద్యమస్ఫూర్తినందించిన 'ఐలమ్మ' తాను
తన ప్రజలను పౌరులుగా
తీర్చిదిద్ది పౌరుషాన్ని
నూరిపోసిన 'భరతమాత' తాను
అగ్నికిరీటం ధరించిన అంగన తాను
ఒక్కొక్క పొరను చీల్చుకుంటూ
ఉద్భవించిన 'భూమాత' తాను
ఇప్పటికైనా అర్థమైందా
ఆమె ఎవరో?






# 37. అనంతపు ఆకాశం

ఈ అనంతపు ఆకాశంలోనే
నన్ను నేను పరిచయం చేసుకున్నాను
నక్షత్రాల కడుపులో, సూదులను దింపి
అందమైన ఆభరణాలను భూమి మీదకి
విసిరేద్దామనుకున్నాను
కానీ,
నాతో దాగుడుమూతలాడుతున్న
చంద్రుడు మాత్రం మూతి తిప్పేస్తూ
నన్ను ఎగతాళి చేశాడు.
సర్లే అని నా రెండు కరములను
చుక్కలకు, శశికి ఇస్తూ
స్నేహపు బాణాన్ని విసిరాను.
బహుశా ఓ మైత్రికోసం గాలిస్తున్నారేమో
నా నెయ్యాన్ని పసిడిపల్లకిలో ఊరేగించారు
జాతిరత్నాల్లాంటి మేము అంబరాన్ని చుట్టేయడానికి
ఓ రాకెట్‌నేసుకొని వెళ్ళాం
దివిలోతుల్లోకి వెళ్ళి వెనక్కి వచ్చేశాం.
చీకటి కమ్ముతుండగా
జాబిలమ్మ నాకు జోలాలి పాడుతుంటే
తారలు నన్ను ఉయ్యాలలూపి
కునుకుకి చేరువచేశాయి
తిరిగి, తిరిగి అలసిన కళ్ళకి
కునుకుపట్టేసింది.

# 38. చిన్నది పెద్దదయ్యింది

అది చిన్నది
అది చిన్నదే
చిన్నదంటారు కానీ
అది పెద్దదే
పిల్ల కాలువల్లో ఆటలాడుకున్నప్పుడు
అది చిన్నదే
ఇప్పుడు సంద్రాలు దాటి
సాహసాలు చేస్తుంది
అది పెద్దదే
దివిలోని తారల్ని చూస్తూ గంతులేసినప్పుడు
అది చిన్నదే
నేడు ఆకాశాన్నే హద్దుగా మార్చుకుంది
అది పెద్దదే
అడుగులు నేర్చినప్పుడు
అది చిన్నదే
నడవడిక నేర్పిస్తుంది
అది పెద్దదే
తొలి పలుకులు పలికినప్పుడు
అది చిన్నదే
జీవిత మెళకువలు నేర్పిస్తుంది
అది పెద్దదే
తనకి అన్నం పెట్టినప్పుడు
అది చిన్నదే
ఇప్పుడు తనే అన్నపూర్ణ అయింది
అది పెద్దదే
అది చిన్నదే అయినా అది పెద్దదే
తను చిన్నదే పెద్దదయ్యింది.





# ౩౨. నాది

కలం నాది

కవిత్వం నాది

గాయం నాది

గమ్యం నాది

బాధ నాది

భారం నాది

అలుపు నాది

గెలుపు నాది

ప్రాణం నాది

పయనం నాది

బలం నాది

గళం నాది

జీవం నాది

భావం నాది

విమర్శ నాది

ప్రశంస నాది

మొత్తంగా ఈ జీవితం నాది.

# 40. రాజీవడ్డ రాత

నా గుండెల గునపం దించినప్పుడు
కత్తివట్టలే,
గుప్పిట్ల బాధను దాస్కున్న.
నా ఆశలకు పెట్రోల్‌వోశి అగ్గంటిచ్చినప్పుడు
ప్రళయకాళ రుద్రున్ని కాలే,
మునుల లెక్క మౌనంగున్న.
నా ఇంట్ల అగ్నిపర్వతాలు పేలినప్పుడు
ఓళ్ళ ఓదార్పు అందుకోలే,
నా కిస్మత్ మంచిగలేదని కండ్లనీళ్ళు వెట్టుకున్న.
నా నవ్వును గీ సుడిగాలి శెదరగొట్టినప్పుడు
సంద్రం లెక్క ఎగిశిపడ్లే,
శెట్టుకు ఉన్న ఆకులెక్క గమ్మునున్న.
ఎందుకంటే,
రాజీవడుతున్న రాతనాది.






# 41. స్నేహగీతి

అతనిని నీవు
ఏం అంటావో కానీ
నేను మాత్రం
నా నేస్తమనే అంటాను.
బహుబంధాలతో
అంధకారాన్ని అలుముకున్న జీవితంలో
రవికిరణంలా ఉదయించాడు.
హరివిల్లులోని రంగులకి
అతనే ఆదర్శం
ధైర్యమే అతడికి దోసిలిచాచింది.
స్నేహమనే రాతిని
రమ్యంగా చెక్కిన శిల్పి అతడు
పలక బలపం పంచుకున్న
స్నేహం కాదు.
ఆత్మీయతను పెంచుకున్న స్నేహం
అడుగడుగులో తోడుండకపోవచ్చు
కానీ,
ఆదరించడంలో ఎప్పుడు ముందుంటాడు
ఎప్పటివరకు తోడుంటాడో తెలీదు
కానీ,
తనస్నేహం నాకు చిరస్మరణీయం.

# 42. ప్రజ్వల గీతం

నెత్తురుని కాటుకగా దిద్ది
హృదయాంతరాలలో దీపం పెట్టి
సంద్రపు కొండలలో నిలిచాను
చావు, పుట్టుకల పొలిమేరల్లో
నా ఊపిరిని నిలిపాను
అశ్రువులు నిండిన కుండలతో
మహార్యణపు చిక్కుదారుల్లో కదిలాను
కలలకు మసి మరకలు పూసి
పొగలతో కప్పి
కథన శంఖం పూరిస్తాను.
కాలం చెల్లిపోతుంది
ఊపిరి బూడిదౌతుంది
ఇప్పుడూ నా ప్రజ్వలగీతం మొదలయింది.





# 43. నీతోడు

నీ ప్రేమలోని మాధుర్యాన్ని
నాకు రుచి చూడాలనుంది
నా చేతి రేఖలు తేలిపోకుండా
నీ శ్వాసతో అల్లుకుపోవాలనుంది
నా జీవితంలో నువ్వోదీపమైతే
నేను ప్రమిదనవ్వాలనుంది
నీ కరుణకు నీ మంచితనానికి
నేను బానిస కావాలనుంది
నువ్వు కొలనులో నీరువైతే
నేను ఆ నీటిపై తామరలా మారిపోవాలనుంది
నువ్వు నేను కలిసి పయనించే క్షణాలలో
నీతోపాటు ఒడిదుడుకులను
ఆస్వాదించాలనుంది
నా జీవితాన్ని నీకు ధారపోయాలనుంది
నీగుండె చప్పుడులా
నీతో ఎల్లవేళలా తోడుండాలనుంది
నీ వేలితో నా వేలిని
ముడివేసి జీవితాన్ని గడపాలనుంది
ఆ క్షణాల కోసం
చివరి వరకూ ఎదురుచూడాలనుంది.

# 44. అకేలా!

నా తల్లి పేగు తెంచుకున్నప్పుడు
నేను ఒంటరిని
జీవసంద్రంలో కొట్టుకుపోతున్నప్పుడూ
నేను ఒంటరినే
అగాధాలలో నన్ను వెలేసినప్పుడు
కూడా నేను ఒంటరినే
నా మనసు అత్యాచారాలకు గురైనప్పుడు
నేను ఒంటరినే
కటిక చీకటిలో వేకువజామును
పరుస్తున్నప్పుడు నేను ఒంటరినే
రక్కసి సమాజం తన గోర్లతో
నన్ను చీలుస్తున్నప్పుడు కూడా
నేను ఒంటరినే
నా కాటిల ముద్దై కాలిపోతున్నప్పుడు
నేను ఒంటరినే
అప్పుడు ఒంటరినే
ఇప్పుడు ఒంటరినే
ఎప్పుడైనా నేను ఒంటరినే.





# 45. స్నేహమేరా...

ఆ మనిషికి
నువ్వు లేకపోతే ఏమి లేదు
నీలో తన ప్రపంచాన్ని చూసుకుంటున్నాడు.
నువ్వు లేకపోతే
ఆ మనిషికి ఈ ప్రపంచంతో పనేంది?
తన మనసుతో నీ స్నేహాన్ని
అనుక్షణం అర్థిస్తున్నాడు.
తుదిశ్వాస వరకు నీ స్నేహాన్ని
తనకు ఇలాగే పంచమని
నువ్వు తనమీద విసిరేసిన నమ్మకపు గింజల్ని
ఏరుకొని నాటి, పెంచి మహావృక్షాన్ని చేశాడు.
ఆ నమ్మకపు వేర్లు తన జీవితంలో
బలంగా నాటుకుపోయాయి.
చావుతో పోరాడుతున్నప్పుడు
నీ శ్వాస తగిలి
మళ్ళీ ఊపిరి పోసుకున్నాడు.
ఆ మనిషికి నువ్వు
లేకపోతే ఏమిలేదు
చివరివరకు తోడుంటా అని
హామీ ఇచ్చావుగా
చిరస్మరణీయంగా గుర్తుపెట్టుకో
నీ ప్రాణం కన్నా
మీ స్నేహం జర పదిలం.

# 46. మాత

పరిమళంలేని పువ్వులా
వికసించాను నేను
సువాసనతో పుడితే
తుంచేస్తారనే భయంతోనే
సంకెళ్ళే స్వేచ్ఛయినా, వాటిని తెంచుకొని మరీ
త్యాగాల తోరణాలు నిండిన
ఈ ప్రపంచంలోకి కాలుమోపాను.
వచ్చిరాగానే వచ్చిందండీ వయ్యారి అంటూ
ఎన్నో కళ్ళు చిట్లించుకున్నా
తడి ఆరని కన్నులతో నవ్వి
తన హస్తాలను నా చుట్టూ
బ్రహ్మాస్త్రంలా చేర్చి
వణుకుతున్న పెదాలతో
నన్ను ముద్దాడింది నా మాతృమూర్తి.





# 47. కాలం

పడమటి సూరీడు
ఎర్రబడ్డాడు
కాదు, కాదు
కాస్త వెచ్చబడ్డాడు.
సమాజం అర్ధరహితంగా మిగిలినప్పుడే
గోరువెచ్చని నిట్టూర్పుసెగలు వెదజల్లుతాయి
కాలంలో కలవనంటూ మారాం చేసినా,
మర్చిపోలేని గుర్తులు మిగిలాయి.
అభ్యుదయానికి రాగం తోడైనప్పుడే,
కవిత్వం ఉదయిస్తుంది
ఎర్రబడిన కళ్ళను చల్లార్చడానికి
మరొక కొత్త భావం అవతారమెత్తుతుంది.

## 48. ప్రయాణం

కదిలే కాలంతో నడుస్తున్నా
నా అడుగుల ఆచూకి తెలియకుండా
గుండెని అరచేతిలో పట్టుకొని నడుస్తున్నా
భయం కనబడకుండా
నా సహనాన్ని పెంచుతూ నడుస్తున్నా
ఆటుపోట్లకు అడ్డం చెప్పకుండా
చేజారిన చిరునవ్వును
వెతకడానికి నడుస్తున్నా
కన్నీళ్ళకు తారసపడకుండా
ఆర్భాటాలకు పోకుండా
ఆలోచనలతో నడుస్తున్నా
మౌనంతో స్నేహం చేసి
మాటల్ని వెనక్కినెట్టి నడుస్తున్నా
శబ్దానికి తావులేకుండా
నేను నడుస్తున్నా
ఒంటరిగానే నడుస్తున్నా
నా గమ్యం చేరేవరకు
నడుస్తూనే ఉంటా!






## 49. అశ్రుకావ్యం


కనులుమూసి తెరిచేలోపూ
జీవితం చీకటైపోయింది
పువ్వులా విరబూసే తన చిరునవ్వుపై
కామాందులు కాటేశారు
తన ఆనందం ఆవిరైపోయింది
ఆ ఇంట్లో దీపం పెట్టే చేతులనే
అగ్నిజ్వాలలు ఆహుతి తీసుకున్నాయి
ఆసిడ్‌తో తన ఆశలని కాల్చేశారు
సిగరెట్లతో కాల్చి ఆమె మేనుని
రక్తపు ముద్దగా చేశారు
సూదులతో గుచ్చి ఊపిరిని మెలిపెట్టారు
ఆ యువతి మెడలో
మందారహారాలు వేసే తన తల్లిదండ్రులు
ఆఖరిసారిగా పూలమాలలు వేస్తున్నారు
ఆనందంగా అడుగులు వేసే
ఆ పాదాలను కన్నీటితో కడిగారు
ఆమె వెళ్తుంది... అందరిని వదిలి వెళుతుంది
తన వారందరిని శోకసంద్రంలో
ముంచి వెళుతుంది
ఆత్మీయుల నుండి అశ్రువుల వీడ్కోలు
అందుకొని వెళుతుంది
ఆమె వెళుతుంది,
అగుపించని లోకాలకు వెళ్ళిపోయింది.

# 50. చివరిక్షణాలు

క్షణక్షణం ఓపిక సడలిపోతుంది
వేదనతో గుండె పరుగెడుతుంది
కళ్ళముందు జీవితచక్రం గిర్రున తిరిగింది
నా కన్నీళ్ళు వాటికి మొండిగా
సమాధానం చెప్పాయి
కాలిపోబోతున్నానని తెలిసికూడా
కళ్ళలో ఆనందాన్ని వెతుక్కుంటున్నా
అణువణువునా ధారలై ప్రవహిస్తున్న
రక్తం నన్నింకా వణికిస్తుంది
చేదు తీపి జ్ఞాపకాల ఉనికిలో
ఎన్నో అద్భుతాలు చూశాను
నేను బూడిదయ్యాక కూడా
నా ఆనవాలు సజీవంగానే ఉంటాయి
ఆ ఆనవాలు ఏరుకోవడానికి
మళ్ళీ నేనే వస్తా
ఊపిరి నాకు అందకుండా
పరుగులు పెడుతుంది
అందుకోవడానికి ఏ శక్తులు లేవు
నా స్వశక్తి మూగబోతుంది
ఇక సెలవు.



## About the Author



Shruthi hails from Annaram village, Kamareddy district. She finished her schooling from ZPHS, Annaram and Intermediate from TSWRJC(G), Tadwai. Shruthi started reading Dr. N. Gopi's works in her eighth grade and has been immensely inspired by his writings. Srisri's words, “Kaadedi Kavitha ki Anarham” has deeply motivated Shruthi to seek her own self in everything around her that is worthy of poetic exploration. Her favourite works are *Vennello Aadapilla* and *Tulasi Dalam* by Yandamuri Veerendranath. Also, *Nitya Gaayala Nadi* by Bojja Ravindra. Her current work, *Nenelaa Varninchanu* is a compilation of fifty poems and fifty breathtaking illustrations which are depicted according to the theme of each poem. Shruthi says “My expression that you come across in this work may sound simple, but the ideas behind them are a reflection of my very own experiences in the society. I may not influence everyone with my book, but I am trying my best to sensitise the readers towards many unspoken aspects of life.” Her deep sighted observations of the human nature and human condition are profoundly reflected in her poetry. Shruthi is currently pursuing BA III year at TSWRDC(W), Nizamabad.

SCHOOL OF
EMERGING WRITERS
Telangana Social Welfare
Residential Educational Institutions Society

9 789348 512871